తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు



	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.32	1,615.71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,784	1,374
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	14,981	9,384
సామర్థ్యం (టీఎంసీలు)	101.46	50.12

అంబేడ్కర్ దీక్షాయాత్ర ప్రారంభం



జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న ఏడీసీ జుబేర్

బళ్లారి సిటీ, అక్టోబరు 10: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమత దీక్ష చేపట్టిన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చేపట్టిన దీక్షాయాత్రను డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేర్ జెండా ఊపి ప్రారంభించారు. అక్టోబరు 10నుంచి 14వరకు నాగ్‌పూర్‌కు అంబేడ్కర్ అనుచరులు యాత్రగా వెళ్లేందుకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు బి.మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబరు నెలలో నాగ్‌పూర్‌లో నిర్వహించే ప్రవర్తనా దినోత్సవ కార్యక్రమానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అనుచరులు దీక్షా యాత్ర చేయడం ఆనవాయితీ అన్నారు. సాంఘిక శాఖ తరపున ఈ ఏడాది జిల్లాలోని వివిధ తాలూకాల నుంచి 180మంది బాబా సాహెబ్ అనుచరులను నాగ్‌పూర్ దీక్షా యాత్రకు పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక శాఖ ప్రథమ శ్రేణి సహాయకుడు శివప్ప, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని తట్టుకోవడానికి యోగా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి రాజేష్ హొసమనె


బళ్లారి సిటీ, అక్టోబరు 10: పని ఒత్తిడిలో మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా, ధ్యానం ప్రాణాయామం అలవర్చుకోవాలని న్యాయాధికారి రాజేష్ హొసమనె సూచించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం న్యాయాధికారి రాజేష్ హొసమనె ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కాలంలో పిల్లల్లో కూడా మానసిక ఒత్తిడి పెరుగుతోందని దీనిని అరికట్టేందుకు అందరూ బహిరంగ చర్చకు రావాలన్నారు. ప్రత్యేక అధ్యాపకులుగా వచ్చిన జిల్లా సైకియాట్రిస్ట్ డాక్టర్ రోహన్ వానగుండి మాట్లాడుతూ, శారీరక ఆరోగ్యానికి ఇచ్చినంత ప్రాధాన్యం మానసిక ఆరోగ్యానికి ఇవ్వడం లేదన్నారు. ప్రతి ఒక్కరి జీవితం ఎత్తుపల్లాలతో నిండి ఉంటుందని, స్మార్ట్ ఫోన్‌లు పని ప్రదేశంలో మానవులపై నిశ్శబ్దంగా ఒత్తిడిని పెంచుతున్నాయన్నారు. మొబైల్ ఫోన్ వాడటం మానేస్తే మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. మనమందరం భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం ద్వారా జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్ మాట్లాడుతూ దేశంలో 25-30 శాతం మంది మానసిక వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. దీనిని నివారించడానికి టెలిహెల్ప్‌లైన్ 14416 ప్రారంభించామని, ఈ హెల్ప్ లైన్ 24గంటలు పనిచేస్తుందన్నారు.

కరవే జిల్లా అధ్యక్షుడిగా ఉలిగప్ప



బళ్లారి రూరల్, అక్టోబరు 10 : బళ్లారి జిల్లా కర్ణాటక రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడిగా హెచ్ ఉలిగప్పను నియమించినట్లు కర్ణాటక రక్షణ వేదిక రాజ్యాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ శెట్టి తెలిపారు. ఆయనకు జిల్లా బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర సంచాలకులు అర్జగిరి రామన్న, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఉమేష్‌గౌడ, ఆనంద్, నాగరాజు, వెంకటేష్ పలువురు కర్ణాటక రక్షణ వేదిక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలి



- వాణిజ్య పరిశ్రమల మండలి డిమాండ్

బళ్లారి సిటీ, అక్టోబరు 10: భారతీయ పరిశ్రమలను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసిన గొప్ప దేశభక్తుడు రతన్ టాటాను కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డుతో సత్కరించాలని బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం పేర్కొంది. రతన్ టాటా ఆత్మ కోసం శాంతికోసం నిర్వహించిన సభకు అధ్యక్షత వహించిన బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ, టాటా ఎప్పుడూ సాహసాలు, సవాళ్లను స్వీకరిస్తూ అద్భుతాలు సాధించే దిశగా అడుగులు వేశారన్నారు. రతన్ టాటా దేశానికి అమూల్యమైన రత్నమని, అంతర్జాతీయ స్థాయిలో భారతీయ పరిశ్రమకు ఒక బ్రాండ్‌ను నిర్మించిన ఘనత ఆయనదేన్నారు. ఆయన లాంటి పారిశ్రామికవేత్త, పరోపకారి, విద్యాభిమాని, దేశ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రద్ధ వహించే వ్యక్తి మళ్లీ పుట్టాలన్నారు. ప్రతి పారిశ్రామికవేత్త రతన్ టాటా జీవితాన్ని ఆదర్శంగా స్వీకరించి దేశానికి సేవ చేయాలన్నారు. మాజీ అధ్యక్షుడు రుద్రగౌడ మాట్లాడుతూ రతన్‌టాటా గొప్పమానవతావాది, పారిశ్రామికవేత్త, విద్యావేత్త, పరోపకారి అంటూ ఆయన ఆశయాలను అందరం అలవర్చుకోవాలన్నారు. రతన్ టాటా నిష్క్రమణ దేశానికి దిగ్భ్రాంతి కలిగిస్తుందన్నారు. టాటా గ్రూపు కంపెనీలను సమర్థంగా అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కోవిడ్ సమయంలో కేంద్రప్రభుత్వానికి రూ.2500 కోట్ల విరాళం అందించిన ఘనత ఆయనదేనన్నారు. అవసరమైతే మరింత డబ్బు ఇస్తానని చెప్పగల ధైర్యం, సాహసం ఆయన సొంతమన్నారు. ఈసందర్భంగా జిల్లా వాణిజ్య పరిశ్రమల శాఖ గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్,జితేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రతన్ టాటాకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న వాణిజ్య పరిశ్రమల మండలి సభ్యులు

టాటా సేవలు మరువలేనివి



బీజేపీ కార్యాలయంలో రతన్ టాటాకు శ్రద్ధాంజలి

సిరుగుప్ప, అక్టోబరు 10: రతన్‌టాటా మహోన్నత పారిశ్రామికవేత్తగా దేశానికి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప అన్నారు. సిరుగుప్ప పట్టణ బీజేపీ కార్యాలయంలో గురువారం రతన్ టాటా మృతికి సంఘీభావంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంతాపసభ నిర్వహించారు. ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రతన్‌టాటా ఆర్థిక రంగంలో ఎంతో ముందడుగు వేశారని, ఎందరికో ఉపాధి కల్పించారని తెలిపారు. ఆయన మహోన్నత దేశభక్తుడని కొనియాడారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మైకేల్ వీరేష, మహదేవ, మోహన్ రెడ్డి, నటరాజు, ప్రధాన కార్యదర్శులు బసవరాజు, మల్లికార్జున, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాం దేవీం శరణమహం ప్రపద్యే!

దుర్గాష్టమి సందర్భంగా దుర్గతులను పోగొట్టే అమ్మగా దర్శనమిచ్చిన అమ్మవారు



చిన్నదుర్గమ్మ ఆలయంలో ..



శ్రీరామాశ్రమంలో మహాదుర్గాదేవిగా



బళ్లారి కనకదుర్గమ్మగా...



కాళికాదేవి అలంకరణలో ..



ప్రత్యేకాలంకరణలో వెంకటరమణ స్వామి

శరన్నవరాత్రులలో ఎనిమిదవరోజు ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. పేట బసవేశ్వర స్వామి ఆలయంలో కొట్టూరు బసవేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలరించారు. అలాగే వెంకటరమణ స్వామి ఆలయంలో స్వామివారికి పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేపట్టారు. కాళికాదేవికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర దేవత కనకదుర్గమ్మ, కౌల్‌బజార్ పెద్దమతల్లి,మల్లాడు దుర్గమ్మ, ఏడుమక్కల తాయి, చిన్నదుర్గమ్మ, హవంబావి దుర్గాదేవి, రేడియోపార్కు పార్వతిదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరీ వాసవీ మాతా తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ముత్తయిదువలు జమ్మి చెట్టును పూజిస్తున్నారు.

గోల్డ్ షాపింగ్ ఫెస్టివల్-2024

- బంగారు నగల కొనుగోలుపై కూపన్ • రాజ్‌మహల్ జ్యువెలర్స్ బంపర్ ఆఫర్...

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 10: విజయదశమి, దీపావళి పండుగలను పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్ర స్థాయిలో బెంగళూరు గోల్డ్ షాపింగ్ ఫెస్టివల్-2024 నిర్వహిస్తున్నట్లు బళ్ళారి నగరానికి చెందిన రాజమహల్ జ్యువెలర్స్ షోరూమ్ నిర్వాహకులు రమేష్, సురేష్‌లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే బెంగళూర్ గోల్డ్ షాపింగ్ ఫెస్టివల్-2024 థర్డ్ ఎడిషన్‌లో రాష్ట్రంలోని ప్రముఖ గోల్డ్‌షాప్‌లతో పాటు బళ్ళారి నగరం నుంచి రాజమహల్ ఫ్యాన్సీ జ్యువెలర్స్ వారు పాల్గొంటున్నట్లు తెలిపారు. రాజ్‌మహల్‌లో బంగారు నగలు కొనుగోలు చేసే ప్రతి కొనుగోలుపై కూపన్ అందిస్తున్నట్లు తెలిపారు. బంగారు ఆభరణాలు, వెండికొనుగోలు చేసే ప్రతి కొనుగోలు దారుడు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామని, వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కోరారు. అక్టోబర్ 3వ తేదీ నుండి నవంబరు 16వ తేదీ మధ్యలో రాజ్‌మహల్ జ్యువెలర్స్‌లో బంగారు ఆభరణాలు కొన్నవారు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులవుతారన్నారు. కర్ణాటక రాష్ట్ర స్థాయిలో గోల్డ్‌ఫెస్టివల్-2024లో లక్కీడ్రాలో గెలుపొందినవారికి 3.5కిలోల గోల్డ్ ప్రైజెస్, 100కిలోల సిల్వర్ ప్రైజెస్, ఒక కిలో గోల్డ్ ప్రైజ్‌లు అందజేస్తున్నట్లు బళ్లారి నగరానికి చెందిన రాజ్‌మహల్ ఫ్యాన్సీ జ్యువెలర్స్ నిర్వాహకులు తెలిపారు.



ఆకాశాన్నంటిన బియ్యం ధరలు

- క్వింటం రూ.7 వేలు పలుకుతున్న సోనామసూరీ, ఐఆర్ 64 రకాలు

బళ్లారి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పండుగ పూట కడుపారా మంచి భోజనం చేయాలనే కోరిక ఉన్న సామాన్యులకు అది తీరడం కష్టంగా మారింది. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ముఖ్యంగా అందరూ వండుకునే బియ్యం రేట్లు ఎప్పుడూ లేనంతగా పెరిగాయి. కిలో బియ్యం ధర రూ.70 కి చేరింది. ఇది వ్యాపారులకు మిల్లర్లకు తీపివార్త అయినా కొని తినే పేదలకు చేదువార్తే.

గతేడాది ఖరీఫ్, రబీల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి అనుకున్నంత విస్తీర్ణంలో సాగు జరగలేదు, మరి కొన్ని చోట్ల సాగు చేసినా తెగుళ్లు, ఇతర కారణాల మూలంగా పంట దిగుబడి పెద్దగా రాలేదు. వీటికి తోడు మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, గుజరాత్ లాంటి రాష్ట్రాల్లోనూ వరి పంట గత ఏడాది పెద్దగా రాలేదు. అవసరమైన బియ్యం మార్కెట్‌లో అందుబాటులో లేకుండా పోవడం కారణంగా వాటి రేట్లు బాగా పెరిగాయని వ్యాపార వర్గాలవారు పేర్కొంటున్నారు. ఈఏడాది తొలి మాసంలోనే బియ్యం ధర క్వింటాల్ రూ.4వేలకు పైగా పలికింది. అది రానురాను ఏకంగా రూ. 7 వేలకు చేరింది. ఏపీ, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువగా అన్నం వండుకునే పూట గడుపుకుంటారు. దీని కారణంగా బియ్యం రేట్లు బాగా పెరిగాయి. దీంతో ఇంత కాలం గోదాముల్లో నిల్వ చేసిన వరి ధాన్యాన్ని ఇప్పుడు వ్యాపారులు బయటకు తీసి మిల్లింగ్ చేసి అమ్ముతున్నారు. దీంతో పండగ పూట కూడా కడుపునిండా అన్నం తినేందుకు అవకాశం లేకుండా పోయిందని సామాన్యప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండిపోతున్న పూలు, గుమ్మడికాయల ధరలు

బళ్లారి సిటీ, కంప్లి, అక్టోబరు 10 : దసరా పండుగ సందర్భంగా పూజసామాగ్రికి రెక్కలొచ్చాయి. గుమ్మడికాయలు, పువ్వుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గతంలో రూ. 150ల ధర వుండే గుమ్మడి కాయ రూ. 500 వరకు పలుకుతోంది. ఒక మూర పూలు రూ. 30 నుంచి ప్రస్తుతం రూ.వందకు చేరింది. ఈ దసరా పండుగ పూల తోటల రైతులకు సంతోషాన్నిచ్చింది. వ్యాపారులతో పాటు కొనుగోళ్లదారులతో నగరానికి కొత్త కళవచ్చింది. నగరంలోని అనంతపురం రోడ్డు, దుర్గమ్మదేవాలయం ముందు, హెచ్ఆర్ గవియప్ప సర్కిల్లో, ఏపీఎంసీ మార్కెట్, బెంగళూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ర ద్దీనెలకొంది. కిలో ఆపిల్ రూ.100నుండి 150కు, అరటిపండ్లు డజన్ రూ.70ల చొప్పున విక్రయిస్తున్నారు.



నవమిదిబ్బకు పోటెత్తిన పర్యాటకులు



మహానవమి దిబ్బ వద్ద పర్యాటకులు

కంప్లి, అక్టోబరు 10: విశ్వవిఖ్యాత హంపి పుణ్యక్షేత్రంలోని మహానవమి దిబ్బకు పర్యాటకులు పోటెత్తారు. క్రీస్తు శకం 1513లో నవదిబ్బను ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. అక్కడ సామ్రాజ్యం ధ్వంసం కావడంతో చివరకు దసరా ఉత్సవాలను మైసూరుకు మార్చారు. కానీ ఇప్పటికీ వారి పూర్వీకులు హంపిలో ఉన్న నవమిదిబ్బను దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి అనంతరం మైసూరులో పూజలు చేపడతారు. రెండురోజులుగా నవమిదిబ్బ వద్ద మైసూరు నుంచి వచ్చిన రాజకుటుంబీకులు పూజలు చేపట్టారు.

ఎర్రితాతకు నాణేలతో అలంకరణ



బళ్లారిరూరల్, అక్టోబరు 10: బళ్లారి తాలుకాలోని చేళగుర్కి తాతకు నవరాత్రులలో భాగంగా విశేషంగా నాణేలతో అలంకరణ నిర్వహించినట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. నవరాత్రుల సందర్భంగా స్వామివారినిపెద్దఎత్తున భక్తాదులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బాలనగౌడ తెలిపారు.

దుర్గాదేవిగా దర్శనమిచ్చిన తాయమ్మదేవి

సిరుగుప్ప, అక్టోబరు 10 : తాలుకాలోని అమ్మవారి ఆలయాల్లో దుర్గాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధానంగా తాయమ్మదేవి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. మహిళలకు ఒడినింపే కార్యక్రమాన్ని చేపట్టారు. తాయమ్మదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన సేవా కార్యక్రమం జరిగింది.



మహిళలకు ఒడినింపుతున్న దృశ్యం

హోసూరు జోన్

దసరా సెలవులతో ట్రాఫిక్ జామ్



బారులు తీరిన వాహనాలు

హోసూరు అక్టోబరు 10: హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జూజూవాడి, సిప్‌కాట్ బేస్‌లో కొనసాగుతున్న జాతీయ రహదారి ఫ్లై ఓవర్ పనుల కారణంగా సిప్‌కాట్ ప్రాంతంలో సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ అయింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, కర్మాగారాలకు వెళ్లే కార్మికులు అసౌకర్యానికి గురౌతున్నారు. గురువారం అత్తిబెలె సరిహద్దు ప్రాంతం నుంచి ద్విచక్ర వాహనాలు, కారులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. దసరా పండుగను ఘనంగా జరుపుకోవడం కోసం తమిళనాడు నుంచి పలు రాష్ట్రాలకు వెళ్లే ప్రజలు, వేరే రాష్ట్రాలనుంచి తమిళనాడుకు వచ్చే ప్రజలతో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. సిప్‌కాట్ ప్రాంతంలో వెయ్యికి పైగా కర్మాగారాలు ఉండడంతో ఇక్కడ పనిచేస్తున్న వివిధ రాష్ట్రాలు జిల్లాకు చెందిన కార్మికులు హోసూరులో నివసిస్తున్నారు, పండగ సమయంలో సెలవులు కావడంతో స్వగ్రామాలకు వెళ్తున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది.

గ్రామీణాభివృద్ధి పథకాలపై కలెక్టర్ సమీక్ష

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 10 : కృష్ణగిరి జిల్లాలో వివిధశాఖల ద్వారా అమలవుతున్న పథకాల గురించి కలెక్టర్ సరయు గురువారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ తరపున, ఆర్టిస్ట్ డ్రీం హోమ్, గ్రామీణ గృహ మరమ్మత్తు పథకం క్రింద మరమ్మతు పనులు, ప్రధాన మంత్రి అవాస్ యోజన ఇంటి నిర్మాణ పనులు, శ్రీలంక తమిళ గృహ నిర్మాణ పనులు, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు, తదితర ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు, ప్రాజెక్టు క్రింద ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని , జిల్లా అభివృద్ధి అధికారులు గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సమావేశంల్లో అదనపు కలెక్టర్ వందనా గార్గ్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రూరల్ డెవలప్‌మెంట్ మలర్విళి అసిస్టెంట్ జిల్లా కలెక్టర్ రామజయం, అసిస్టెంట్ డైరెక్టర్ మహదేవన్, జిల్లా అభివృద్ధి ఇంజనీర్లు పాల్గొన్నారు.

చంద్రాంబిక చెరువును బాగు చేయాలి

హోసూరు అక్టోబరు 10: హోసూరు ప్రాంతంలోని వందకు పైగా చెరువులు పరిశ్రమల వల్ల క్రమక్రమంగా కనుమరుగవుతూ వచ్చాయి. హోసూరు-బెంగళూరు జాతీయ రహదారి పక్కన దర్గా ప్రాంతంల్లో చంద్రాంబిక సరస్సు గతంలో ఎల్లప్పుడూ నీటితో కళకళలాడుతుండేది. ప్రస్తుతం పారిశ్రామికీకరణ కారణంగా చెరువు నిండా గుర్రపుడెక్క పేరుకుపోయింది. ప్రస్తుతం ఇలా మారడంతో ప్రజలందరూ దీనిని సరి చేయాలని, ఈ చెరువులో వ్యర్థ జలాలు చేరనీయకుండా అధికారులు దీనిని నియంత్రించాలని కోరుతున్నారు. 2011లో జిల్లా అధికారులు ఈ సరస్సును శుద్ధీకరించి బోటు షికారు చేసేందుకు ప్రయత్నించారు. కానీ ఆ తర్వాత చెరువు చుట్టు ఇళ్ల నిర్మాణం జరగడంతో అలాగే వదలివేశారు. ఇప్పటికైనా బోటు షికారు సదుపాయం, ఇంకా పార్కు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.



గుర్రపు డెక్కతో నిండిన చంద్రాంబిక సరస్సు

రోడ్డు పై గుట్టలుగా విద్యార్థుల పాదరక్షలు

రాయచూరు, అక్టోబరు 10 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన షూలు, సాక్స్‌లు రోడ్లపై దర్శనమిచ్చాయి. నగరంలోని కేఈబీ ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకోసం 2024-25వ విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకజత షూలు, రెండు జతల సాక్స్‌లను ప్రభుత్వం అందజేసింది. వీటిని పాఠశాల అభివృద్ధి కమిటీల ద్వారా అందించేందుకు ఆదేశించగా వాటిని ప్రైవేటు వ్యక్తికి అప్పగించారు. దీంతో ఈ సమస్య తలెత్తినట్లు తెలిసింది.



రోడ్డుపై కుప్పలుగా పడి ఉన్న షూలు, సాక్స్‌లు

పాఠశాల ఎస్‌డీఎంసీ కమిటీ వారు విద్యార్థులకు షూలు, సాక్స్‌లు అందజేయకుండా వాటిని ప్రైవేటు వ్యక్తికి అప్పగించగా ఆ వ్యక్తి పాఠశాల నుంచి వాటిని ఇతర ప్రాంతానికి రవాణా చేస్తున్న సందర్భంగా అవన్నీ గురువారం ఉదయం రోడ్డుపై కుప్పలుగా పడిపోయాయి. దీన్ని గమనించిన స్థానికులు పాఠశాల తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు. విద్యార్థులకు అందాల్సిన షూలు, సాక్స్‌లు ప్రైవేటు వ్యక్తి చేతికి ఎలా వెళ్లాయని ఏదో ఇక్కడ అవినీతి జరిగిందంటూ తల్లిదండ్రులు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కలుషిత మాంసాహారంతో 20 మందికి అస్వస్థత

రాయచూరు, అక్టోబరు 10: దేవుడి కోసం చేసిన మాంసాహారాన్ని భుజించి 20 మందికి పైగా అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం రాత్రి జిల్లాలోని లింగసుగూరు తాలూకా పరంపూర్ తాండాలో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న తాలూకా ఆరోగ్య అధికారి వైద్యుల బృందం అక్కడికి వెళ్లి బాధితులకు వైద్యసేవలందించారు. 10 మందిని తాలూకా ఆస్పత్రికి తరలించి చికిత్సనందించగా మరో 10 మందికి స్థానికంగానే ప్రాథమిక చికిత్స అందించినట్లు అధికారులు తెలిపారు. సమస్య గురించి భయపడాల్సిన పని లేదని, ప్రాణాపాయమేమి లేదని తాలూకా ఆరోగ్య అధికారి తెలిపారు. కాగా దేవుడి నైవేద్యం కోసం చేసిన మాంసహారం కలుషితం కావడం వల్లే భోజనం చేసిన వారిలో చాలా మందికి వాంతులు, విరేచనాలు చోటు చేసుకున్నాయన్నారు. ఆహారం శాంపిళ్లను సేకరించి పరీక్షకు పంపామని అధికారి వివరించారు. అదే సమయంలో తాండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

14న దర్శన్ బెయిల్‌పై నిర్ణయం

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసుకు సంబంధించి నటుడు దర్శన్‌కు బెయిల్ మంజూరు అవుతుందా, లేదా అన్నది ఈనెల 14న తేలనుంది. బెంగళూరు 57వ సీసీహెచ్ కోర్టులో దర్శన్ బెయిల్ పిటీషన్‌పై గురువారం విచారణ సాగింది. న్యాయమూర్తి జయశంకర్ తీర్పును ఈనెల 14వ తేదీకి వాయిదా వేశారు. దీంతో దసరా ముగిసేదాకా దర్శన్ బళ్లారి జైలులోనే గడపాల్సి ఉంటుంది.

రాజరాజేశ్వరిగా శారదామాత


రాజరాజేశ్వరి అలంకరణలో శృంగేరి శారదామాత



బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన గురువారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నాడదేవత చాముండేశ్వరి దేవికి ఉదయం నాగలక్ష్మి అలంకరణ చేయగా సాయంత్రానికి కాళరాత్రి అలంకరణ చేయడం గమనార్హం. శృంగేరిలోని శారదామాత రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చింది. బెంగళూరు బనశంకరి దేవికి ప్రత్యేకంగా చీరలతో కంచుకవస్త్ర పేరిట అలంకరించారు. గిరినగర్‌లోని వాసవిమాత గరుడవాహన ధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. బెంగళూరు సహా రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో పూజలు కొనసాగాయి.

నాగలక్ష్మి అలంకారంలో మైసూరు చాముండేశ్వరి

గరుడవాహనంపై ఊరేగుతున్న గిరినగర్ వాసవీమాత



ఆయుధపూజకు వేళాయె..!


విధానసౌధలో ఆయుధపూజలో హోంమంత్రి పరమేశ్వర్



● నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆయుధపూజ ● అమాంతం పెరిగిన పూలధరలు ● ఎటుచూసినా గుమ్మడికాయల రాశులు ● విధానసౌధలో ఒకరోజు ముందే..


డీసీపీ కార్యాలయంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రులు చివరి దశకు చేరుకున్నాయి. నవమి నాడు నిర్వహించే ఆయుధపూజకు అంతా సిద్ధమయ్యింది. ఆయుధపూజ, విజయదశమి వేడుకల సందర్భంగా గురువారం మార్కెట్లు కిటకిటలాడాయి. సాధారణంగానే దసరా అంటే పూలు, పండ్లకు డిమాండ్ ఎక్కువే. ప్రత్యేకించి ఆయుధపూజలో వాహనాలు, అన్ని రకాల వ్యాపారాలు, పరిశ్రమలు సంస్థలు, కంపెనీలు, కార్యాలయాలలో పూజలు జరుపుతారు. శుక్రవారం ఆయుధపూజ కావడంతో రెండురోజుల క్రితం నుంచే బెంగళూరులోని కేఆర్ మార్కెట్, మల్లేశ్వరం, మడివాళ, కేఆర్ పురంతోపాటు పలు చోట్ల భారీగా పూలు, పండ్ల విక్రయాలు సాగాయి. మల్లెలు సాధారణంగా కేజీ రూ.400 ఉండగా రూ.800 ధర పలికాయి. కనకాంబరం సాధారణంగా రూ.400-600 ఉండగా ప్రస్తుతం రూ.2వేలకు చేరింది. గులాబీలు రూ.400, చామంతి రూ.300, సుగంధరాజ్ రూ.350, చెండుమల్లి రూ.100 కేజీగా ఉన్నాయి. అరటిగెలలు, మామిడితోరణాలు, గరిక, బిల్వపత్ర ధర పెరిగింది. దసరా పూజల్లో గుమ్మడికాయలు కొట్టే ఆనవాయితీ ఉంది. ఇందుకోసం ఎటు చూసినా గుమ్మడి రాశులుగా కనిపించాయి. ప్రభుత్వ కార్యాలయాలకు రెండు రోజులు వరుస సెలవులు ఉండడంతో గురువారం విధానసౌధ, వికాససౌధల్లో ప్రత్యేక పూజలు సాగాయి. లెజిస్లేచర్‌హౌస్ ప్రాంగణంలో ప్రభుత్వ వాహనాలకు ఆయుధపూజ చేశారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్ పూజల్లో పాల్గొన్నారు. కాగా సెలవుల నేపథ్యంలో సాధారణం కంటే ప్రధాన రహదారులపై రద్దీ ఎక్కువగా నెలకొంది.


ఆర్‌టీనగర్ మార్కెట్‌లో రద్దీ ఇలా..


మోహినీ అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

మోహినిగా మురిపించిన శ్రీవారు

కదిరి, అక్టోబరు 10: పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు గురువారం మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాల అనంతరం మోహినీ అలంకారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

సిలబస్ కాకుండానే

సెమిస్టర్

● షెడ్యూల్ విడుదలతో ఆందోళన
● బెంబేలెత్తుతున్న విద్యార్థులు



బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అతిథి అధ్యాపకుల నియామకాల విషయంలో పలు కారణాలతో జాప్యం జరుగుతోంది. అయితే విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో వాటికి అనుగుణంగానే సెమిస్టర్ పరీక్షలకు షెడ్యూల్ ఖరారు చేశారు. అధ్యాపకులు లేకుండానే పరీక్షలు ముంచుకొస్తుండడంతో డిగ్రీ విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. బదిలీలు, కొత్తగా నియామకాలతోపాటు యూజీసీ నిబంధనల ప్రకారం అతిథి అధ్యాపకుల నియామకం జరగాల్సి ఉండడంతో జాప్యం జరిగింది. తుమకూరు యూనివర్సిటీ సెప్టెంబరు 27 నుంచి, దావణగెరె యూనివర్సిటీ పరిధిలోని కాలేజీలకు సెమిస్టర్ అక్టోబరు 1 నుంచి అకడమిక్ ప్రారంభమైంది. మిగిలిన యూనివర్సిటీలలో ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా 432 డిగ్రీ కళాశాలలు ఉండగా ఏటా 11,532 మంది గెస్ట్ లెక్చరర్‌లు నియమించుకునేవారు. ఇప్పటివరకు ప్రక్రియ ప్రారంభం కాలేదు. కానీ అన్ని యూనివర్సిటీలలోనూ నవంబరులోనే సెమిస్టర్ పరీక్షలు ఆరంభం కావాల్సి ఉంది. డిసెంబరు నెలాఖరులోగా పరీక్షలు పూర్తి చేయాల్సి ఉంది. నామమాత్రంగా పరీక్షలు జరిపితే యూనివర్సిటీలకే ఎదురుదెబ్బ పడనుంది. పటిష్టంగా పరీక్షలు జరపాలనుకుంటే తరగతులే కాకపోవడం మరో సమస్యగా మారింది. నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరిగితే ఆలోగా సిలబస్ పూర్తి కావడం సాధ్యమయ్యేది అనుమానమే అనిపిస్తోంది. ఇందుకు కారణం తగినంత సమయం తక్కువగా ఉండడం, అధ్యాపకుల కొరత స్పష్టంగా తెలుస్తోంది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని రద్దు చేసి స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని అమలు చేస్తున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓ సమస్య కాగా, 3వ, 5వ సెమిస్టర్ విద్యార్థులకు స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీ ఏ విధంగా అమలు చేస్తారనేది అంతు చిక్కని విషయంగా మారింది. అధ్యాపకులు లేకపోవడం, మరోవైపు గత ఏడాది విధానం రద్దు చేయడతో కొత్త ఇబ్బంది వచ్చి పడింది. నవంబరులోనే సెమిస్టర్ పరీక్షలు జరిగితే ఎలా అనే తర్జనభర్జనలో విద్యార్థులు ఉన్నారు.

హుబ్బళ్ళితో టాటాకు ప్రత్యేక అనుబంధం


రాయపురలోని ఇస్కాన్ కిచెన్ సెంటర్‌ను సందర్శించిన రతన్‌టాటా (ఫైల్)


రతన్ టాటాతో ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణమూర్తి (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): టాటా గ్రూప్ సంస్థల చైర్మన్ రతన్‌టాటాకు హుబ్బళ్ళితో ప్రత్యేక అనుబంధం ఉంది. హుబ్బళ్ళిలోని వీవీ కళాశాల ప్రాంగణంలో 2013 జనవరి 30న దేశ్‌పాండే ఫౌండేషన్ టిప్పింగ్ పాయిం ట్ పేరిట మూడు రోజుల ప్రగతి సమీక్ష కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రతన్‌టాటా పాల్గొన్నారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి జరిపిన చర్చాగోష్టిలో సుదీర్ఘంగా పారిశ్రామిక ప్రగతిపై ఆయన ప్రసంగించారు. స్టార్టప్‌లతోపాటు పరిశ్రమల ప్రారంభం, వాటి నిర్వహణ అనే అంశాలను ప్రస్తావించారు. ఇదే సందర్భంలోనే హుబ్బళ్ళి - ధారవాడ ప్రాంతంలోని రాయపురలోని ఇస్కాన్ కిచెన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ సమాచారం తెలుసుకున్నారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో రతన్‌టాటాకు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నారాయణమూర్తి పాదాభివందనం చేసిన విషయం తెలిసిందే.

కొవిడ్ అక్రమాలపై విచారణ



● కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
● సిట్‌తో పూర్తి దర్యాప్తు
● మంత్రివర్గ తీర్మానం

బెంగళూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో కొవిడ్ అక్రమాలపై సిట్ తోపాటు మంత్రివర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలన కేబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం మంత్రివర్గ భేటీ జరిగింది. కేబినెట్‌లో తీర్మానాలను రాష్ట్ర శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వెల్లడించారు. 16 అంశాలపై కేబినెట్‌లో చర్చించినట్లు ఆయన తెలిపారు. కొవిడ్ పరిధిలో అవినీతికి సంబంధించి దర్యాప్తునకు కేబినెట్ సబ్‌కమిటీతోపాటు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొవిడ్‌వేళ వస్తువుల కొనుగోళ్లకు సంబంధించి నియమించబడిన న్యాయమూర్తి మైఖేల్ డి కున్హా కమిషన్ 2024 ఆగస్టు 31న సమర్పించిన నివేదికపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించామన్నారు. కమిషన్ 11 సంపుటలతో నివేదిక ఇచ్చిందన్నారు. 7,223.64 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని తేల్చిందన్నారు. 500 కోట్ల రూపాయలు వసూలు చేయాలని కమిషన్ సిఫారసు చేసిందన్నారు. బీబీఎంపీ 4 డివిజన్‌లతోపాటు 31 జిల్లాల నివేదిక ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. 55వేల ఫైళ్లకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ అనుమతులను పరిశీలించి నివేదిక ఇచ్చారన్నారు. ఇందులో క్రిమినల్ అంశాలు ఉన్నందున సిట్ ఏర్పాటు చేయాలని తీర్మానించామన్నారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ధారించామన్నారు. 500 కోట్ల రూపాయల వసూళ్లకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు.

కొవిడ్ అక్రమాల్లో భాగస్వామ్యులైన కంపెనీలు, సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లోకి చేర్చాలని తీర్మానించామన్నారు. ఎక్కడెక్కడ అవినీతి జరిగిందో వాటికి సిట్ తనిఖీలు దృష్టిసారించి దర్యాప్తు చేస్తుందన్నారు. ఎవరి భాగస్వామ్యం ఏమిటనేది సిట్ దర్యాప్తులో బహిర్గతం కానుందన్నారు. సమగ్ర నివేదిక వచ్చాక ఎంతమేర అవినీతి జరిగింది, భాగస్వామ్యులు ఎవరనేది తేలుతుందన్నారు. ఎవరు తప్పు చేసినా చర్యలు ఉంటాయన్నారు. కొవిడ్ అక్రమాల్లో ఎవరు ఉన్నారని చెప్పలేమన్నారు. దర్యాప్తు చేసిన కున్హా కమిషన్ వెల్లడించాలన్నారు. సమగ్ర నివేదిక వచ్చాక నిజాలు తేలుతా యన్నారు. కున్హా కమిషన్ వేగవంతంగా పనిచేస్తోందని, న్యాయం లభిస్తుందనే విశ్వాసం ఉందన్నారు. కేబినెట్‌లో సీఎం సిద్దరామయ్యకు సంపూర్ణమైన మద్దతు లభించిందని, మంత్రులందరూ పాల్గొన్నారన్నారు. కొందరు మంత్రుల ప్రత్యేక భేటీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడాన్ని ప్రత్యేకంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

సబ్ కమిటీ సభ్యులు వీరే..

కొవిడ్ అక్రమాలపై దర్యాప్తుకోసం రిటైర్డు న్యాయమూర్తి జాన్ మైఖేల్ డి కున్హా నేతృత్వంలోని కమిటీ తన తొలి నివేదికను సమర్పించింది. సదరు నివేదికలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నట్లు ప్రస్తావించారు. నివేదికను పరిశీలించేందుకు డీసీఎం అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. సబ్ కమిటీలో అధ్యక్షుడిగా డీసీఎం డీకే శివకుమార్, సభ్యులుగా మంత్రులు పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, దినేశ్ గుండూరావు, ప్రియాంక ఖర్గే, సంతోష్‌లాడ్, శరణ ప్రకాశ్ పాటిల్ ఉన్నారు.



మగశిశువు విక్రయం కేసు

వైద్యురాలి అరెస్టు

● మరో ఏడుగురు కూడా..

బెంగళూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన వైద్య వృత్తి చేపట్టి డబ్బు కోసం అక్రమాలకు పాల్పడ్డ వైద్యురాలు కటకటాలపాలయ్యింది. దావణగెరెలో నవజాతశిశువు విక్రయానికి సంబంధించిన వివాదంలో డాక్టర్ సహా 8మందిని అరెస్టు చేశారు. ఎంకే మెమోరియల్ ఆసుపత్రి డాక్టర్ భారతి, శిశువు తల్లి కావ్య, శిశువును కొనుగోలు చేసిన ప్రశాంత్, జయ దంపతులతోపాటు మధ్యవర్తులుగా వ్యవహరించిన వాజిరాజ్, మంజమ్మ, సురేశ్, రమేశ్‌లను అరెస్టు చేశారు. రెండున్నర నెలల మగశిశువును స్త్రీ శిశుసంక్షేమశాఖ సంరక్షణా కేంద్రంలో ఉంచారు. హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసినవారు శిశువును పొందిన సమాచారం ఇవ్వడంతో జిల్లా మహిళా పోలీసులు, స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారి టీఎస్ కవితా నేతృత్వంలో కార్యాచరణ జరిపారు. 8మందిని గురువారం జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. విడాకులు తీసుకున్న కావ్య రెండున్నర నెలల క్రితం మహారాష్ట్రలోని సొల్లాపురలో ఓ శిశువుకు జన్మనిచ్చారు. దావణగెరెకు వచ్చిన ఆమె శిశువును విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఎనిమిదేళ్లుగా పిల్లలు లేని దంపతులు మధ్యవర్తి వాజిరాజ్ ద్వారా రూ.5లక్షలకు కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎంకె మెమోరియల్ ఆసుపత్రి డాక్టర్ భారతి, సిబ్బంది మంజుళ నకిలీ జన్మధ్రువీకరణ పత్రాన్ని తయారు చేసి సహకరించారు. జయ, ప్రశాంత్ దంపతులకు ఆగస్టు 26న శిశువు జన్మించినట్టుగా డాక్టర్ భారతి రికార్డును సృష్టించారు. వాటికి అనుగుణంగానే దావణగెరె మహానగర పాలికె బర్త్ సర్టిఫికెట్ మంజూరు చేసింది. హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫోన్‌కాల్ ఆధారంగా దర్యాప్తు జరపడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే సాక్షాత్తు వైద్యులే శిశువుల అక్రమాలు ప్రోత్సహించడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

నానాజీ దేశ్‌ముఖ్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత నానాజీ దేశ్‌ముఖ్ 1916 అక్టోబరు 11న మహారాష్ట్రలో హింగోలి జిల్లా కడోలి ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు చండికాదాస్ అమృత రావ్ దేశ్‌ముఖ్. సామాజిక ఉద్యమకారుడు, రాజకీయ నేతగా విద్య, ఆరోగ్యం గ్రామీణ స్వావలంబనకు కృషి చేశారు. బాలగంగాధర తిలక్‌తో స్ఫూర్తిపొంది 'భారతీయ జనసంఘ్' నేతగా ఎదిగారు. భూదాన్ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నారు. తొలి గ్రామీణ విశ్వవిద్యాలయం 'చిత్రకూట్ గ్రామోదయ్ విశ్వవిద్యాలయ'ను స్థాపించి చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. 2010 ఫిబ్రవరి 27న కన్నుమూశారు. మరణానంతరం 'భారతరత్న' ప్రకటించారు.

సాలూరు రాజేశ్వరరావు (జయంతి)




సాలూరు రాజేశ్వరరావు 1922 అక్టోబరు 11న విజయనగరం జిల్లా సాలూరు మండలం శివ రామపురంలో జన్మించారు. తెలుగు సినీ రంగంలో సుమారు ఐదు దశాబ్దాలపాటు మధురమైన గీతాలను అందించిన సంగీత దర్శకులలో ఒకరు. లలిత సంగీతానికి శ్రీకారం చుట్టి కొత్త ఒరవడి సృష్టించారు. శాస్త్రీయ సంగీత బాణీలు, కర్ణాటక, హిందూస్తానీ రాగాలలో జుగల్‌బందీలు ఇలా పలు ప్రక్రియలు సాగించారు. 'మాయాబజార్'లో అభిమన్యుడి పాత్రతో మెప్పించి గాయక నటుడిగా నిరూపించుకున్నారు. కళాప్రపూర్ణ, కళైమామణి గౌరవాలు అందుకున్నారు. 1999 అక్టోబరు 25న కన్నుమూశారు.

థిక్ నాట్ హన్ (జయంతి)



వియత్నాం దేశానికి చెందిన సాధువు థిక్ నాట్ హన్ 1926 అక్టోబరు 11న జన్మించారు. శాంతి కోసం ఎంతోపాటుపడ్డారు. 'ప్లమ్ విలేజ్ ట్రెడిషన్'ను స్థాపించారు. 'మహాయాన' బుద్ధిజంలో తర్ఫీదు పొందారు. అమెరికాలో బుద్ధిజం లెక్చరర్‌గా కొనసాగారు. ఫ్రెంచ్, చైనీస్, సంస్కృతం, ఇంగ్లీషు, జపనీస్, పాలి భాషలలో ప్రావీణ్యం సాధించి 100కుపైగా పుస్తకాలు ప్రచురించగా ప్రపంచవ్యాప్తంగా 50లక్షలకు పైగా అమ్ముడయ్యాయి. ఆధ్యాత్మిక ప్రసంగీకులుగా రాణిస్తున్నారు. నోబెల్ ప్రైజ్‌కు నామినేట్ అయ్యారు. 2022 జనవరి 22న కన్నుమూశారు.

కద్రీ గోపాలనాథ్ (వర్ధంతి)



నాదస్వర విద్వాన్, 'పద్మశ్రీ' గ్రహీత కద్రీ గోపాలనాథ్ 1949 డిసెంబరు 6న దక్షిణకన్నడ జిల్లా బంట్వాళలో జన్మించారు. నాదస్వరంతోపాటు 'సాక్సోఫోన్' వాదనలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కచేరీలలో పాల్గొని సాక్సోఫోన్ చక్రవర్తిగా పేరొందారు. త్యాగరాజ కీర్తనలు ఆలపించడంలో ప్రత్యేకత. కంచికామకోటి పీఠం, శృంగేరీ శారదాపీఠంలలో ఆస్థాన విద్వాన్‌గా వ్యవహరించారు. గానకళాశ్రీ, నాదోపాసన బ్రహ్మ, నాద కళారత్న, సంగీత వాద్యరత్న, కళైమామణి, రాజ్యోత్సవ అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు. 2019 అక్టోబరు 11న కన్నుమూశారు.

అమితాబ్ బచ్చన్ (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' అమితాబ్ బచ్చన్ 1942 అక్టోబరు 11న అలహా బాద్‌లో జన్మించారు. నటుడు, నిర్మాత, గాయకుడు, వ్యాఖ్యాతగా పేరొందారు. ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న తొలి నటుడు. ఫిల్మ్‌ఫేర్ అవార్డులకు 41సార్లు నామినేట్ అయ్యారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు పొందారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. నాలుగు దశాబ్దాలలో 180 సినిమాలలో నటించారు. బుల్లితెరపై 'కౌన్ బనేగా కరోడ్ పతి'కి హోస్ట్‌గా వ్యవహరించి మరోసారి సత్తా చాటుకున్నారు. 2000లో మేడమ్ టుస్సాడ్ మ్యూజియంలో తొలి లివింగ్ ఏషియన్ విగ్రహం ఏర్పాటు కావడం విశేషం.



సత్యసాయిబాబాతో రతన్‌టాటా(ఫైల్)

పుట్టపర్తిలోనూ రతన్‌టాటా సేవలు

● 2009లో ప్రశాంతి నిలయం సందర్శన

పుట్టపర్తి, అక్టోబరు 10: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు పుట్టపర్తితో విడదీయరాని బంధం ఉంది. సామాజిక సేవ, దాతృత్వం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రతన్ టాటా.. సత్యసాయి బాబా సూచన మేరకు విద్యావాహిణి ప్రాజెక్టుకు సహకారం అందించారు. సత్యసాయిబాబాతో రతన్‌టాటాకు విడదీయరాని అనుబంధం ఉండేది. సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, సేవలకు ఆకర్షితుడైన రతన్‌టాటా మొదటిసారి 2009 డిసెంబరు 3న ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. సత్యసాయి ధర్మవనంలో సేవలను స్వయంగా పరిశీలించారు. తాను సైతం సేవా కార్యక్రమాల్లో భాగస్వాముడినవుతానని బాబాను కోరారు. దీంతో సత్యసాయిబాబా.. శ్రీసత్యసాయి విద్యావాహిణి ప్రాజెక్టులో పాలుపంచుకోవాలని బాబా సూచించారు. 2010 నవంబరు 23న సత్యసాయి తన పుట్టినరోజు వేడుకల సందర్భంగా శ్రీసత్యసాయి విద్యావాహిణి ప్రాజెక్టును ప్రారంభించారు. మొదటి విడతలో 9 లక్షల మందికి విద్య అందించడానికి రతన్‌టాటా ముందుకొచ్చారు. తద్వారా మాతృభూమికి సేవ, బాధ్యతాయుత, ఆధ్యాత్మిక సేవలతో కూడిన విలువల విద్యను అందించి, దృఢసంకల్పం కలిగిన యువతను తయారు చేసేందుకు విద్యావాహిణి ప్రాజెక్టు పనిచేసింది. ప్రాజెక్టులో వేలాదిమంది ఉపాధ్యాయులు చేరి.. లక్షలాది మంది విద్యార్థులకు పాఠాలు బోధించారు. అలా రతన్‌టాటా.. సత్యసాయి సేవలకు తనవంతు సహకారం అందించి, భక్తిని చాటుకున్నారు. పుట్టపర్తితో విడదీయరాని బంధం ఏర్పరచుకున్నారు.

ధనలక్ష్మిగా ముత్యాలమ్మ..

▸▸ అంబారీపై ఊరేగిన దుర్గామహేశ్వరి


విజయపుర, అక్టోబరు 10: దసరా నవరాత్రుల్లో ధనలక్ష్మి అవతారంలో ముత్యాలమ్మ దర్శనమిచ్చారు. పలు రూపాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. జీవనంలో ఎన్నో సమస్యలు ఉంటాయని ఆలయాల సందర్శన ద్వారా మానసిక ప్రశాంతత సాధ్యమని దుర్గామహేశ్వరి అమ్మవారి ఆలయ అర్చకులు నాగరాజప్పస్వామి అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర హోబళి పరిధిలోని గడ్డదనాయకనహళ్ళిలో దుర్గా మహేశ్వరి అమ్మవారి ఆలయ దుర్గాష్టమి మహోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలన్నారు. దైవ సందర్శన, ధ్యానంతో మనలోని వికారాలను దూరం చేసుకోవచ్చు నన్నారు. దుర్గాహోమం, ఊయలసేవ, గణపతి హోమం, పుణ్యాహవచనం, దేవనాంది, పంచగవ్య స్నపన, నవగ్రహ పూజ, కళశస్థాపన, మంగళారతి తదితర హోమాదికాలు, కైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతా భిషేకం, రుద్రాభిషేకం, దివ్యాంలకరణ, అష్టావధాన సేవల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వివిధ కళా బృందాల నడుమ అంబారిపై అమ్మవారిని ఊరేగించారు. వీరభద్ర, వీరగాసె తదితర కళాబృందాలు సందడి చేశాయి. భక్తిగీతాలాపన ఆకట్టుకుంది. వెయ్యిమందికిపైగా భక్తులు పాల్గొనగా తీర్థప్రసాదాలు, అన్నదాసోహం నిర్వహించారు.



అమ్మవారికి విశేష అలంకరణ



అంబారీపై దుర్గామహేశ్వరి ఊరేగింపు



ధనలక్ష్మి అలంకరణలో దొడ్డజాల ముత్యాలమ్మదేవి



బశెట్టిహళ్ళిలో చండేశ్వరీదేవి



అమ్మవారికి సరస్వతి అలంకరణ

దొడ్డజాలలో విశేషపూజలు

దేవనహళ్ళి: అంతర్జాతీయ విమానాశ్రయ కేంద్రానికి అత్యంత సమీపంలో ఉండే దొడ్డజాలలోని ముత్యాలమ్మ దేవికి నవరాత్రులలో నిత్యం విశేషపూజలు కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా ఎనిమిదోరోజు గురువారం ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ రకాల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

శిడ్లఘట్టలో..

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట తాలూకా బశెట్టిహళ్ళి గేట్ సమీపానగల చండేశ్వరి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. శరన్నవరాత్రులను పురస్కరించుకుని నిత్యం ఒక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. గురువారం ఉదయం 6గంటలకు అభిషేకం, పుష్పాలంకరణ, పసుకు కుంకుమలతో అర్చన, ధూపదీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మాల్దీవుల అధ్యక్షుడికి ఆత్మీయ వీడ్కోలు



బయల్దేరిన మాల్దీవుల అధ్యక్ష దంపతులు



వీడ్కోలు పలుకుతున్న అధికారులు

బెంగళూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మాల్దీవ్స్ అధ్యక్షుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. బెంగళూరు పర్యటనకు వచ్చిన మాల్దీవ్స్ అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ మొయిజ్జు, ప్రథమ పౌరురాలు సాజిదా మహ్మద్‌కు గురువారం వీడ్కోలు పలికారు. ఉన్నత విద్యా శాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్‌తోపాటు పలువురు అధికారులు కెంపేగౌడ ఇంట ర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో వీడ్కోలు పలికారు. మాల్దీవ్స్ అధ్యక్షుడు బుధవారం మధ్యాహ్నం బెంగళూరుకు చేరుకుని రాజ్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సీఎం సిద్ద రామయ్యలతో మాల్దీవ్స్‌లో వాణిజ్య వ్యవ హారాలపై చర్చించారు. అనంతరం తాజ్ వెస్టెండ్ హోటల్‌లో దేశ, కర్ణాటకకు చెందిన పారిశ్రామిక వేత్తలతో ప్రత్యేక సభలో పాల్గొని అక్కడే బస చేశారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీకి వెనుతిరిగారు. ఇండియా మాల్దీవ్స్ హై కమిషనర్ మును మహవర్, రాష్ట్ర పాలనా వ్యవహారాల శాఖ కార్యదర్శి సత్యవతి, నగర పోలీస్ కమిషనర్ దయానంద్, బెంగళూరు గ్రామీణ జిల్లా అధికారి శివశంకర్, ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి కృష్ణతోపాటు పలువురు సీనియర్ అధికారులు మాల్దీవ్స్ అధ్యక్ష, ప్రథమ మహిళకు ఘనంగా వీడ్కోలు పలికారు.

భిన్నత్వంలో ఏకత్వమే ప్రత్యేకత



శిక్షణ పొందిన విద్యార్థులతో ముఖ్యులు

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధభాషలు, ఆహారశైలి, జీవన పద్ధతులతో కూడిన భారతదేశం భిన్న సంస్కృతులతో ఏకత్వంగా ఉందని బెంగళూరు ఉత్తర డిప్యూటీ పోలీస్ కమిషనర్ సైదులు అడావత్ అభిప్రాయపడ్డారు. కన్నడ సంఘం, బంజార సంస్కృతి, భాషా అకాడమీ సహకారంతో నగరంలోని ప్రభుత్వ కళాశాలలో ఎంబ్రాయిడరీ నేర్పే శిబిరం ముగింపులో గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బంజారాల సంస్కృతి, వేషధారణ భిన్నంగా ఉంటుందన్నారు. వ్యవసాయం, పశువుల పెంపకం, వ్యాపారంలో వీరు నేర్పరులన్నారు. కౌశల్య అభివృద్ధి మండలి అధ్యక్షురాలు కాంతానాయక్ మాట్లాడుతూ సముదాయ వర్గాలలోని నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. బంజార సంస్కృతి, భాషా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఏఆర్ గోవిందస్వామి నేతృత్వంలో విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. సంచారజాతులలో ఒకటైన బంజారాలో నేర్పరులు ఉన్నారన్నారు. తాండా అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎన్ జయదేవ నాయక్, ట్రైనర్ ప్రశాంత్ హెబ్బసూరు ముఖ్యులుగా పాల్గొనగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీటి శ్రీనివాసనాయక్ అధ్యక్షత వహించారు. కళాశాల కన్నడ సంఘం సంచాలకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి అతిథులను, సభికులను స్వాగతించారు. ఎంబ్రాయిడరీలో తర్ఫీదు పొందిన విద్యార్థుల కళా ప్రదర్శన ఆకట్టుకుంది.

నౌకాయాన ఉద్యోగి అరెస్టు

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని ఓ ప్రైవేట్ కంపెనీ నౌకాయాన ఉద్యోగిని బెంగళూరు గోవిందపుర పోలీసులు అరెస్టు చేశారు. చత్తీస్‌ఘడ్ యువతిని ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకుని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశారనే ఆరోపణలతో కేరళకు చెందిన బిలాల్ రఫీక్ (30)ను అరెస్టు చేశారు. కొన్నేళ్లక్రితం బెంగళూరుకు వచ్చి స్థిరపడిన బాధితురాలు ఆసుపత్రిలో పనిచేస్తూ దాసరహళ్ళి లే అవుట్‌లో నివసిస్తున్నారు. 2021లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కేరళకు చెందిన బిలాల్ రఫీక్ పరిచయ మయ్యారు. మొబైల్ నెంబర్లు షేర్ చేసుకున్నాక వాట్సప్ చాటింగ్ చేశారు. ఇలా కొంత కాలం ప్రేమలో గడిపారు. 2022 మే నెలలో బిలాల్ రఫీక్ బెంగళూరుకు వచ్చి సహకార నగర్‌లోని ఓ గెస్ట్‌హౌస్‌కు తీసుకెళ్లారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకుని మోసం చేశారని ఆమె ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. చత్తీస్‌ఘడ్‌కు వెళ్లి యువతి కుటుంబ సభ్యులతో పెళ్లికి ఒప్పించారు. రఫీక్ కుటుంబ సభ్యులు కూడా అంగీకరించారు. నగదు, మొబైల్‌తోపాటు పలు వస్తువులను రఫీక్‌కు బహుమతిగా ఇచ్చినట్టు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తర్వాత పెళ్లి విషయం ప్రస్తావించకుండా దాటవేస్తున్నారని, ఇటీవల రఫీక్ కుటుంబ సభ్యులు ఫోన్ చేసి దూషించి పెళ్లికి అంగీకరించలేదని హెచ్చరిం చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. రఫీక్ కూడా ఇదే తరహాలో వ్యవహరించిన మేరకు ఫిర్యాదు చేశారని, దీంతో గురువారం రఫీక్‌ను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. సమగ్ర దర్యాప్తు జరుపుతామన్నారు.

వృద్ధులైన తల్లిదండ్రులను ఆదరించండి



వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న ప్రముఖులు

బాగేపల్లి, అక్టోబరు 10: వయసు పైబడిన వృద్ధ తల్లిదండ్రులను భారంగా భావించకుండా బాధ్యతగా వారి యోగక్షేమాలను పట్టించుకోవాలని డాక్టర్ ఎంఎస్ రాజారెడ్డి అభిమానుల సంఘం యువ నాయకుడు షాహిద్ అభిప్రాయపడ్డారు. కర్ణాటక తొలి ముఖ్యమంత్రి కేసీ రెడ్డి మనుమడు విజయకుమార్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని డాక్టర్ ఎంఎస్ రాజారెడ్డి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో తాలూకాలోని గూళూరు శివారులోని వృద్ధాశ్రమంలో గురువారం కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయకుమార్‌రెడ్డి సరళవ్యక్తిత్వంతోపాటు పేదల సంక్షేమం పట్ల ఆసక్తి కల్గినవారన్నారు. కాగా జీవితాంతం పిల్లలకోసం పాటుపడిన తల్లిదండ్రులను ఇటీవలి కాలంలో వయసు పైబడిన తర్వాత వారిని పిల్లలే వృద్ధాశ్రమాల్లోకి చేర్చడం బాధా కరమన్నారు. ప్రతి ఒక్కరూ వృద్ధులవుతారని, కష్టం అనేది గుర్తుంచుకోవాలన్నారు. నేటి యువత పుట్టినరోజు వంటి సందర్భాలలో జల్సాలు చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. అందుకు బదులుగా సమాజ సేవ చేయాలని సూచించారు. ఈ దిశగా యువతలో మార్పు రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర జేడీఎస్ యువ బ్రిగేడ్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

చిక్క అంకండహళ్లి ఉపాధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం



నూతన ఉపాధ్యక్షుడు మూర్తితో సభ్యులు తదితరులు

బంగారపేట, అక్టోబరు 10: తాలూకాలోని చిక్క అంకండంహళ్ళి గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడిగా బీఎం మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శివారెడ్డి వ్యవహరించారు. నూతన అధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ ఉపాధ్యక్ష ఎన్నికల్లో సహకారం అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధి లక్ష్యమన్నారు. ఇందుకు సభ్యులందరి సహకారం తీసుకుంటామన్నారు. మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు హరీశ్ కుమార్ మాట్లాడుతూ కోలారు జిల్లాలో చిక్కఅంకడంహళ్ళి పంచాయతీకి మంచి పేరుందని అలాగే కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా సభ్యులు హెచ్‌ఎం రవి, మంగళాక్షమ్మ, శివశంకర్ రాధమ్మ, రామప్ప, లక్ష్మమ్మ, గిరిజమ్మ, నయాజ్‌పాష, సురేశ్, వెంకటేశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు బంగారు ప్రభావళి వితరణ



బంగారు ప్రభావళిని అందజేస్తున్న జయం కృష్ణమోహన్ దంపతులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 10 : నగరంలోని ఆర్‌కే నగర్‌కు చెందిన జయం క్రిష్ణమోహన్, అరుణ దంపతులు కొత్తూరు అమ్మవారిశాలకు బంగారు ప్రభావళి వితరణ చేశారు. దాదాపు రూ.10లక్షల వ్యయంతో తయారు చేయించిన బంగారు పూత ప్రభావళిని గురువారం రాత్రి స్థానిక కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులును కలిసి అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి, అమ్మ వారి తీర్థప్రసాదా లు, శేషవస్త్రాన్ని దాతలకు ఆలయ కార్యవర్గం చేతుల మీదుగా అందజేసి సత్కరించారు. మిట్టా అంజనేయులు, టంగుటూరి నాగ భూషణం, తల్లం మురళి, కృష్ణం రఘు, జయం సురేష్ పాల్గొన్నారు.

ఉగ్రవాద ఆరోపణలు...

పాకిస్థాన్‌వాసితో సహా ముగ్గురికి ఉపశమనం

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పరప్పన అగ్రహార జైలులో ఉంటూ నిషేధించబడిన లష్కర్ -ఎ-తోయిబా సంస్థతో సంబంధాలు కలిగి ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొన్నారని, యావజ్జీవ కారాగార శిక్షకు గురైన ముగ్గురికి హైకోర్టు ధర్మాసనం ఉపశమనం కల్పించింది. బెంగళూరు నివాసి సయ్యద్ అబ్దుల్ రెహ మాన్, చిక్కబళ్ళాపుర జిల్లా చింతామణికి చెందిన అఫ్సర్‌పాషా, పాకిస్థాన్ దేశం కరాచీ నివాసి మహ్మద్ ఫహద్ హై అలియాస్ మహ్మద్ కోయాలపై సెషన్స్ కోర్టు విధించిన యావజ్జీవ కారాగార శిక్షపై హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. సమగ్ర విచారణలు జరిపిన న్యాయమూర్తి శ్రీనివాస హరీశ్‌కుమార్, న్యాయమూర్తి జేఎం ఖాజిల ధర్మాసనం గురువారం తీర్పు ప్రకటిం చింది. వారికి ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయని రుజువు చేసేందుకు తనిఖీ అధికారులు సమర్పించిన సాక్ష్యాలు సరిపోవని స్పష్టం చేసింది. పాకిస్థాన్ వాసిని జైలునుంచి బయటకు రాగానే సరి హద్దును దాటించాలని ఆదేశించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి ఆరోపితులపై విచార ణలకు ముందస్తు అనుమతి పొందే ప్రక్రియలో జరిగిన లోపం ద్వారానే నిందితులపై కేసు కొట్టేశామన్నారు. వీరిపై 2012 మే 7న ఆరోపణలు వచ్చాయి. బెంగళూరుతోపాటు పలు చోట్ల యువతను క్రోడీ కరించుకుని ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడాలని కుట్ర పన్నారని కేసు నమోదు చేశారు. యావజ్జీవ కారాగారశిక్షతోపాటు పేలుడు వస్తువుల చట్టం కింద అదనంగా 5-10ఏళ్ల జైలుశిక్ష విధించాలని తీర్మానించారు. వీటిని వ్యతిరేకిస్తూ ముగ్గురు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయగా విచారణ జరిపిన ధర్మాసనం తీర్పును ప్రకటించింది.

చెక్‌బౌన్స్ కేసులో హెచ్‌ఎంకు జైలు

పెనుకొండ టౌన్, అక్టోబరు 10: చెక్‌బౌన్స్ కేసులో హిందూపురం మండలం ముదిరెడ్డిపల్లికి చెందిన ప్రధానోపాధ్యాయురాలు అంజనీ లక్ష్మీకళకు ఆరు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. కోర్టు కానిస్టేబుల్ బాబ్జాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంజనీలక్ష్మీకళ ప్రస్తుతం ముదిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. 2022లో పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ వద్ద రూ.6.72లక్షలు అప్పుగా తీసుకుంది. తిరిగి చెల్లించకపోవడంతో చెక్కు తీసుకున్నారు. దా నిని బ్యాంకులో వేశారు. అది బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయాధికారి బొజ్జప్ప.. హెచ్‌ఎం అంజనీలక్ష్మీకళకు ఆరునెలల సాధారణ జైలుశిక్షతోపాటు రూ.13.44 లక్షల అపరాధ రుసుం విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెలన్నర జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.50

అనంతపురం రూరల్, అక్టోబరు 10: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.24పలికినట్లు ఆయన తెలిపారు.